ఇద్దరు అధికారుల సస్పెన్షన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఇద్దరు అధికారులపై కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం చర్యలు తీసుకున్నారు. ఎమ్మిగనూరు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రఘువీర్, హొళగుంద ఆర్ఐ దినేజ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు అధికారులపై ఇటీవల కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆదోని సబ్ కలెక్టర్ విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో రఘువీర్, దినేజ్ కుమార్‌లను సస్పెండ్ చేశారు.



జీవితాలతో జూదం...!

ఆదోనిలో ఆన్‌లైన్ జూదం విచ్చలవిడిగా కొనసాగుతోంది. రాష్ట్రంలో నిషేధం ఉన్నప్పటికీ పక్కనున్న కర్ణాటక నుంచి నిర్వాహకులు ఆన్‌లైన్ జిల్లా వాసులను ప్రలోభాలకు గురిచేస్తూ జూదం ఆడేలా చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా నష్టపోతున్నది దినసరి కూలీలే.. అడ్డదారిలో అనతికాలంలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో యువత పక్కదారి పడుతోంది. ఆన్‌లైన్ జూదం, మట్కాపై డబ్బులు పెట్టి నిలువెల్లా మునిగిపోతున్నారు. పోయిన డబ్బు మళ్లీ గెలువవచ్చన్న కొండంత ఆశతో మళ్ళీ మళ్లీ ఆడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఆటను నిర్వహిస్తున్న ఏజెంట్లు మాత్రం రూ. లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నారు. ఆదోని కేంద్రంగా ఈ దందా కొనసాగుతోంది.



- ఆన్‌లైన్ ఆటలతో చీకటిమయం
- పెడదారి పడుతున్న యువత
- పట్టించుకోని అధికారులు
- ఆదోని కేంద్రంగా కొనసాగుతున్న దందా

ఆదోని, ఆగస్టు 19: ఆదోనిలో మట్కా జూదం ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణకు కర్ణాటక ఇతర రాష్ట్రాల వారు ఆదోనిలో కొంత మంది ఏజెంట్లను పెట్టుకున్నారు. ఈ ఆటలో డబ్బులు పెట్టిన నెంబర్ తాకితే రెండింతలు, మూడింతలు డబ్బులివ్వాల్సి ఉంటుంది. మట్కా నెంబరుపై డబ్బులను ఇక్కడి ఏజెంట్లు ముందస్తుగానే వసూలు చేస్తారు. ఆన్‌లైన్ సైట్‌లో బెట్టింగ్‌కు అంక్, సింగిల్ పత్తా, ట్రిపుల్ పత్తా, జోడి, డబుల్ పత్తా ఉంటాయి. ఇందులో పెట్టుబడి పెడితే నెంబరు వస్తే రూ.1000 వచ్చే అవకాశాలున్నాయి. అయితే అది అంత సులభం కాదు. ఆట ఆడి చాలామంది నష్టపోతున్నారు. ఈ ఆటను ఆంధ్ర రాష్ట్రంలో నిషేధించారు. అయినప్పటికీ దొంగచాటుగా విచ్చలవిడిగా నడిపిస్తున్నారు. ఈ ఆటను అధికంగా దైనందిన కూలీలు ఆడుతున్నారు. పొద్దంతా కష్టపడి వచ్చిన డబ్బును ఈ ఆటలోనే పెట్టి నష్టపోతున్నారు. దీంతో పాటు సెల్‌ఫోన్ల ద్వారా నడిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డబ్బుల చెల్లింపు కూడా ఆన్‌లైన్ ద్వారానే చేస్తారు. మట్కాలో ప్రధానంగా ఓపెన్, క్లోజ్ రెండు ఆటలు ఉంటాయి. కర్ణాటక కేంద్రంగా నిర్వహిస్తారు. ముంబాయిలో మధ్యాహ్నం ఓపెన్ చేస్తారు. కళ్యాణి ఆటలో రాత్రి క్లోజ్ చేస్తారు. ముంబాయి ఆట ఫలితాలు మధ్యాహ్నం రెండు గంటలకు విడుదల చేస్తారు. అలాగే క్లోజ్ నెంబరు రాత్రి 10 గంటలకు ప్రకటిస్తారు. ఓపెన్ విభాగంలో సింగిల్ అంకెకు రూ.11 పెడితే రూ.100 ఇస్తారు. డబుల్ నెంబరుకు రూ.11పెడితే రూ.500, ట్రిబుల్ డిజిట్ పానా గేంలో రూ.11 పెడితే రూ.1400 ఇస్తారు. ఇలా ఒక్కో లెక్కలు చూపి అమాయకులకు ఆశ చూపిస్తున్నారు. కర్ణాటకలో ఈ ఆటకు నిషేధం లేకపోవటంతో పక్కనే ఉన్న గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఆదోనికి నిత్యం ఆటలు ఆడేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఆన్‌లైన్ గేమింట్ ఉండటంతో సెల్ ఫోన్‌లోనే నెంబర్లు చెప్పటం, డబ్బులు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపిస్తున్నారు. పెట్టుబడులు పెట్టిన వారు మునిగి పోతున్నారే తప్ప లాభపడిన వారు ఎవరూ లేరని ఈ ఆట ఆడిన వారు చెబుతున్నారు.

కొరవడిన నిఘా

ఆదోని పట్టణంలో మట్కా అధికంగా నడుస్తోంది. పోలీసులు అడపాదడపా చిన్న పాటి కేసుల నమోదు చేస్తున్నారు. ఈ ఆటను పూర్తిగా అరికట్ట లేకపోతున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత యథావిధిగానే ఈ దందాను కొనసాగిస్తున్నారు. యువత చెడు మార్గం పట్టకుండా ఉండాలంటే పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసులకు నెల మామూళ్లు?

మట్కా నిర్వాహకులు పోలీసుల స్థాయిని బట్టి నెల మామూలు ఇస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మామూళ్లు ఇవ్వనప్పుడు స్టేషన్‌కి పిలిపించడం కేసులు నమోదు చేయడం చేయడం జరుగుతోందని అంటున్నారు. గంజాయి, సారాయి విక్రయిస్తున్నట్లు కేసులు నమోదు చేస్తున్నారని అంటున్నారు. అదే పోలీసులకు చేతులు తడిపితే నోరుమెదపకుండా పోలీసులు వెళ్లి పోతారని, లేదంటే స్టేషన్‌లో చుట్టూ తిప్పుకుంటారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


మట్కా నిర్వాహకుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు (ఫైల్)

చట్టపరంగా న్యాయం చేస్తాం

ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, ఆగస్టు 19: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కోడుమూరులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో గాంధీ వికలాంగుల పొదుపు సంఘానికి చెందిన చంద్రన్న సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి 22 కంతుల మొత్తం, పొదుపు డబ్బులు రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేయకుండా పరారీలో ఉన్నాడని దేవనకొండ మండలం, బండ్లగట్టు గ్రామానికి చెందిన ఎస్‌బీ వీరేష్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తన ఇంటిని తనకు బహుమతి కింద ఇల్లు రాసి ఇచ్చినట్లు, నకిలీ నోటీసు చూపిస్తూ రాము అనే వ్యక్తి చేసిన మోసంపై కర్నూలు కుమ్మరిగేరికి చెందిన శకుంతల ఫిర్యాదు చేశారు. తన తండ్రికి కిడ్నీ ఇప్పిస్తామని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న టెక్నీషియన్ నరసింహులు రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులో కేకే గ్రూప్ ఇన్వెస్టిమెంటు ట్రేడింగ్ కంపెనీ పేరు చెప్పి రూ.లక్షకు పది శాతం కమిషన్ ఇస్తామని రూ.5 లక్షలు కట్టించుకుని రెండు నెలలు మాత్రమే కమిషన్ ఇచ్చి మోసం చేశారని కర్నూలు ఇందిరమ్మ కాలనీ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

- బెంగుళూరులో సాఫ్టవేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన శ్రేయాస్ అనేవ్యక్తి రూ.4.30 లక్షలు తీసుకుని బోగస్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించి మోసం చేశాడనీ కర్నూలుకు చెందిన ప్రకాష్ రాజు ఫిర్యాదు చేశాడు.
- రోహిత్ రెడ్డితో పాటు మరో ఇద్దరు కలిసి వరంగల్‌లో ఉంటున్న ఏఆర్‌కే గ్లోబల్ సొల్యూషన్స్ పేరుతో బ్రిట్ లీలా యూకే లిమిటెడ్ లండన్‌లో తమ కుమారుడికి సాఫ్టవేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.30 లక్షలు తీసుకుని మోసం చేశాడనీ కర్నూలు చెందిన రమేష్‌బాబు ఫిర్యాదు చేశారు.
- గోనెగండ్లకు చెందిన రఫీక్ అనే వ్యక్తి రాజమండ్రిలో ఇరిగేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.4.50లక్షలు తీసుకుని మోసం చేశాడనీ కర్నూలు, పెద్దపడాఖానాకు చెందిన విష్ణు ఫిర్యాదు చేశారు.
- తమ పొలాన్ని కౌలుకు తీసుకుని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఇనయతుల్లా అనే వ్యక్తిపై దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన నజీర్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయసలహాదారుడు మల్లికార్జున రావు, సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

దంచికొట్టిన వాన

- భారీ వర్షానికి నేలకూలిన వృక్షాలు
- చెరువులను తలపిస్తున్న శివారు కాలనీలు, రోడ్లు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 19: పది రోజులుగా కర్నూలు, కల్లూరు ప్రాంతాల్లో వర్షం జాడ లేక.. మండుతుండన్న ఎండలతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అయితే ఆదివారం రాత్రి, సోమవారం మధ్యాహ్నం నుంచి వాన దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులతో నగర ప్రజలు భీతిల్లిపోయారు. గాలి, వానకు ప్రధాన రోడ్లపై చెట్లు విరిగి పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరో వైపు లోతట్టు కాలనీల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. జోహరాపురంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన భారీ వర్షానికి ఇళ్ల సమీపంలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా గంటలపాటు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే సీ క్యాంపు సర్కిల్ వెనుక రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సమాచారం తెలుసుకున్న వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టుకొమ్మలను నరికివేశారు. దాదాపు 2 గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. కొత్తబస్టాండు సమీపంలోని కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద నీళ్లు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వచ్చి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కల్లూరు చెన్నమ్మ సర్కిల్, మల్లారెడ్డి అర్బన్ కాలనీ, సెయింట్ జోసెఫ్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ వెనుక ప్రాంతంలో భారీ వర్షానికి వర్షం నీళ్లు ఒక చెరువులను తలపిస్తున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కల్లూరు ఐటీసీ కాలనీ, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, జంపాల శివయ్య నగర్, నిర్మల్ నగర్, మురారీ నగర్ తదితర శివారు కాలనీల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


సీ క్యాంపు వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్టు

న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్‌లో నాలుగు ఎక్స్‌రే మిషన్లు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 19: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో నాలుగు ఎక్స్‌రే మిషన్లు, ఒక సీఆర్ రీడర్ ప్రింటర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఇందులో 500 ఎంఎ, 300 ఎంఎ ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయని అతిపెద్ద ఎక్స్‌రే ప్లాంట్ల సేవలు రోగులకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో 9 ఎక్స్‌రే మిషన్లు ఉండగా.. కొత్తగా నాలుగు ఎక్స్‌రే ప్లాంట్లను ప్రారంభించడం వల్ల రోగులకు ఎక్స్‌రే సేవలు త్వరితగతిన తీయడానికి వీలుంటుందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్, రక్త పరీక్షలతో పాటు ఎక్స్‌రేలను కూడా అన్ని ఒకే న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో నిర్వహించడం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, రేడియాలజీ ప్రొఫెసర్ పద్మలత, అసోసియేట్ ప్రొఫెసర్లు హరినాథ్, కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అరుణ్, మంజు భార్గవి, రవినాయక్, ఏఆర్ఎంవో వెంకటరమణ, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.


రేడియోగ్రఫీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులు పని చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్షించారు. అర్జీల పరిష్కారంపై సీఎంవో కార్యాలయం నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షణ జరుగుతోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. గడువులోపు అర్జీలను పరిష్కరించాలని, గడువు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లాగిన్ ఉన్న ప్రతి అధికారి ప్రతిరోజు సాయంత్రం తప్పనిసరిగా లాగిన్ ఓపెన్ చేసి అర్జీలను పరిశీలించి గడువులోపు వాటిని పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకూడదని, ఒకవేళ రీఓపెన్ అయితే జిల్లా అధికారే బాధ్యత వహించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్‌కు సంబంధించిన ఆడిటింగ్ టీములు కూడా రీఓపెన్ కేసులను పరిశీలించాలన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డులను రెవెన్యూకు సంబంధించిన పిటిషన్లు 80 శాతం వస్తున్నాయనీ, అందువల్ల ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో సమీక్షించాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

కొండలరాయుడికి వృశ్చిక సమర్పయామి..

- శ్రావణ మాసంలో కోడుమూరులో వింత ఆచారం
- దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

కోడుమూరు, ఆగస్టు 19: కోడుమూరులోని ఎతైన కొండపై ఒక చిన్న గుడిలో కొండలరాయుడు రూపంలో కొలువైన వేంకటేశ్వరస్వామికి తేళ్లను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే మూడో సోమవారం ఇక్కడ జరిగే వింత ఆచారానికి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాధిగా తరలిరావడం విశేషం. గుడిలోని భక్తులు కొండలరాయుడిస్వామికి తేళ్లతో పూజలు చేస్తారు. భక్తులు కాలినడకతో కొండపైకి నడుచుకుంటూ వస్తారు. ఇందులో భాగంగా సోమవారం భక్తులు భారీ ఎత్తున తరలిచ్చారు. భక్తితో స్వామిని మనస్సులో స్మరించుకొని ఏ రాయిని కదిపినా తేళ్ల దర్శమిస్తాయి. దర్శమిచ్చిన తేళ్లను చిన్నపిల్లలు సైతం చేతితో పట్టుకొని స్వామి విగ్రహంపై వదిలేస్తారు. ఈ వింత ఆచారాన్ని తిలకించేందుకు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరవచ్చారు. ఇలా తేళ్లను స్వామి విగ్రహంపై వదిలి పూజలు చేయడం వల్ల కోరికలు తీరుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఇలా కనిపించిన తేళ్లను భక్తులు చేతిలోకి తీసుకొని పూజలు చేపట్టారు. కొంత మంది యువకులు, పిల్లలు, తేళ్లతో వింత విన్యాసాలు చేశారు. అరచేతి, తల, నాలుక వంటి శరీర భాగాలపై తేళ్లను ఉంచుకొని విన్యాసాలు చేశారు. ఇంత చేసినా భక్తులను తేలు కుట్టకపోవడంపై విశేషం. స్వామిని మనస్సులో అనుకుని పూజిస్తే తేళ్ల ఎలాంటి హాని చేయవని ఇక్కడి భక్తుల నమ్మకం. సోమవారం ఒక వైపు వర్షం కురుస్తున్నప్పటికి భక్తులు స్వామిని దర్శనం కోసం బారులుదీరారు. స్వామిని దర్శించుకున్న భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు.


తేళ్లను అరచేతిలోకి తీసుకున్న భక్తులు



మయూర వాహనంపై ప్రహ్లాదరాయలు

- మూల రాములకు కనకాభిషేకం
- శాఖోత్సవం చేసిన పీఠాధిపతి
- కొనసాగుతున్న సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం, ఆగస్టు 19: శ్రీగురు మహిమాన్విత క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రహ్లాదరాయులు మయూరవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మూలరాములకు కనకాభిషేకం చేసిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకిలో ఊరేగింపుతో వచ్చి నూతనంగా బెంగుళూరు చెందిన నాగరాజు అను భక్తుడు నిర్మిస్తున్న యాగశాలలో ఊంజల సేవలో అధిష్టించి పీఠాధిపతి శాఖోత్సవం చేసి మహమంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మఠం ప్రాంగణం మార్మోగింది. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, గులాబి ప్రత్యేక పుష్పాలతో శోభాయానుమానంగా అలంకరించి పీఠాధిపతి మహ మంగళహారతి ఇచ్చారు. రాఘవేంద్ర సర్కిల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ రవి కులకర్ణి, సీఆర్‌వోలు విజయేంద్రాచార్, స్కెచ్ రాఘవేంద్ర, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, బీఎం ఆనందరావు, మంత్రాలయం సీఐ రామాంజులు ఎస్ఐ గోపినాథ్, వాదిరాజాచార్ పాల్గొన్నారు.

నేడు పూర్వారాధన

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన ఘట్టం మూడో రోజు మంగళవారం జరగనుంది. రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం నుంచి కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. రాత్రి రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ముగ్గురు విద్వాంసులకు పీఠాధిపతి ప్రదానం చేయనున్నారు.


మయూర వాహనంపై దర్శనం ఇచ్చిన ప్రహ్లాదరాయలు

ఆకట్టుకున్న భరత నాట్యం: సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో పుత్తూరు చెందిన నృత్య పాసన కళా అకాడమీ బృందంచే భరతనాట్యం, మైసూరు చెందిన విద్యవిందచే నాగలహరి సంగీత కచేరి, బెంగళూరుకు చెందిన నరసింహనాయక్‌చే దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులకు పీఠాధిపతి శేషవస్త్రం, మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాంక్షితలు ఇచ్చి సత్కరించారు.


భరతనాట్యం చేస్తున్న పుత్తూరు కళాకారులు


నూతన యాగశాలలో ప్రహ్లాదరాయల ఊంజల సేవ

దివికేగిన సాహితీ దిగ్గజం

కాశీభట్ల వేణుగోపాల్‌కు ప్రముఖుల నివాళి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త కాశీభట్ల వేణుగోపాల్ (72) సోమవారం వేకువ జామున కన్నుమూశారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల సొంత ఇంటిలో ఒంటరిగా జీవిస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాశీభట్ల మృతి చెందారని తెలుసుకున్న పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం కర్నూలు సాహితీ ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. సోమవారం కాశీభట్ల స్వగృహంలో ఆయన పార్థీవ దేహానికి పలువురు కవులు, కళాకారులు, నగర ప్రముఖులు నివాళులర్పించారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. సోమవారం మధ్యాహ్నం కర్నూలు పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో కాశీభట్ల వేణుగోపాల్ అంత్యక్రియలు జరిగాయి. బంధువులు, స్నేహితులు, సాహిత్యాభిమానులు కన్నీటి పర్యంతం మధ్య అశ్రునివాళులతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

కవులు, రచయితలు, కళాకారుల నివాళి

కాశీభట్ల మృతి పట్ల జిల్లాకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు నివాళులర్పించారు. ఆయన రచనలు మానవ సంబంధాలకు ఆనవాళ్లుగా నిలుస్తాయని, ఆయన రచనలను భద్రపరచి భావి తరాలు చదువుకునే అవకాశం కల్పించాలని కథా సమయం సంస్థ రచయిత ఇనాయతుల్లా అభిప్రాయపడ్డారు. 1990లో ఆయన రాసిన తపన నవల తానా సంస్థ నుంచి అప్పట్లో రూ.లక్ష గెలుపొందిందని, కాశీభట్ల హైస్కూలు విద్య నుంచీ క్లాస్‌మేట్ కావడం తన అదృష్టమని మధురకవి ఎలమర్తి రమణయ్య గుర్తు చేసుకున్నారు. సాహితీ రంగంలో ఆయన ప్రస్థానం అసామాన్యంగా సాగిందని చెప్పారు. సినీనటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు వంశీ వంటి వారితో మంచి పరిచయాలు ఉండేవని, తనికెళ్ల అనేక సార్లు కాశీభట్ల స్వగృహానికి వచ్చారని తెలిపారు. కర్నూలులో పుట్టిన కాశీభట్లకు ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని, కానీ ఆయన రచనలు గొప్పగొప్ప కవులనే మెప్పించాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణియాదవ్, కవులు వెంకటకృష్ణ, డాక్టర్ ఎం. హరికిషన్, తెలుగు వెంకటేశ్ కొనియాడారు. జిల్లా సాహిత్య రంగంలో కాశీభట్ల ఒక మహోన్నత కవిత్వ శిఖరమని శ్లాఘించారు. కాశీభట్ల మృతి సాహితీరంగానికి తీరని లోటని పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి, తెలుగు భాషా వికాస ఉద్యమం, తెలుగు కళాసమితి ప్రతినిధులు సుస్వరం వాసుదేవమూర్తి, డాక్టర్ పి. చంద్రశేఖర్, కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మలు కొనియాడారు.



కాశీభట్ల వేణుగోపాల్ (ఫైల్)

పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు లోడింగ్ కార్మికులు

బేతంచెర్ల, ఆగస్టు 19: మండలంలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న ముచ్చట్ల బిల్కు నాగేశ్వరరావు గని వద్ద పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు లోడింగ్ కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. డోన్‌కు చెందిన ట్రాక్టర్ చిప్స్ ఫ్యాక్టరీకి కలర్ బొగ్గడ రాళ్లను తీసుకుని వెళ్లేందుకు ముచ్చట్ల బిల్కు నాపరాళ్ల గనుల వద్దకు వచ్చారు. అంతలోనే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ కింద డ్రైవర్ రమేష్, లోడింగ్ కార్మికులు శ్రీను, మరో వ్యక్తి కూర్చుని ఉండగా.. పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. లోడింగ్ కార్మికులు అక్కడి నుంచి పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. రమేష్ స్వగ్రామం కొచ్చెర్వు కాగా, గత 13 ఏళ్లుగా డోన్ లో నివాసముంటున్నాడు. మృతునికి భార్య లీలావతి, కొడుకు కూతురు ఉన్నారు.

సారా వ్యాపారి హత్య

● నాగనాథనహళ్లి ఘటన మరవక ముందే పెద్దహరివాణంలో..

ఆదోని రూరల్ ఆగస్టు 19 : అర్ధరాత్రి సారా వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పెద్ద హరివాణంలో ఇంటి బయట కట్టపై సోమవారం జరిగింది. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఉప్పర శేకన్న(50) కర్ణాటక మద్యం, సారా వ్యాపారం చేస్తున్నాడు. 30 సంవత్సరాల క్రితం బళ్లారి జిల్లా శిరుగుప్ప తాలుకా ఉప్పర హాళ్ గ్రామానికి జయమ్మతో వివాహమైంది. జయమ్మకు పిల్లలకు కాకపోవడంతో సమీప బంధువు కర్ణాటక రాష్ట్రం గంగావతి పక్కన ఉన్న పాత డణాపురానికి చెందిన గంగమ్మను 17 సంవత్సరాల క్రితం శేకన్న రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు భార్యలు, పిల్లలతో కలిసి శేకన్న ఒకే ఇంట్లో ఉంటూ, కర్ణాటక మద్యం, సారా విక్రయిస్తూ, కుటుంబాన్ని పోషించుకున్నాడు. ఇతని వ్యాపారానికి గత వైసీపీ ప్రభుత్వం పూర్తి అండగా ఉండేది. ప్రభుత్వం మారాక శేకన్న రెండు నెలల క్రితం ఇద్దరు భార్యలతో కలిసి బెంగుళూరుకు వలస వెళ్లాడు. బెంగుళూరులో రెండవ భార్య గంగమ్మ, శేకన్నల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికెళ్లి సమీప కర్ణాటక పోలీస్‌స్టేషన్‌లో భర్త శేకన్నపై ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా, 15రోజుల క్రితం శేకన్న పెద్ద భార్య జయమ్మతో కలిసి సొంతూరు పెద్దహరివాణం చేరుకున్నాడు. ఈనెల 12వ తేదిన గ్రామ వైసీపీ నాయకులతోపాటు శేకన్నకు బీజేపీ కండువా వేసి ఎమ్మెల్యే పార్థసారధి పార్టీలో చేర్చుకున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట కట్టపై గుర్తు తెలియని దుండగులు గొంతుకోసి శేకన్నను అత్యంత దారుణంగా చంపేశారు. గ్రామానికి చెందిన సారా డాన్‌కు, మృతుడికి మధ్య విభేధాలు ఉన్నట్లు కూడ తెలుస్తోంది. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య ప్రదేశంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ సోమన్న తెలిపారు.



శేకన్న (ఫైల్)

నా భర్తకు రెండో పెళ్లి నేనే చేశా

నాకు పిల్లలు కాకపోవడంతో నా భర్త శేకన్నకు మా చిన్నతాత మనవరాలు గంగమ్మను 17 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేశాను. అప్పటి నుండి మేమంతా కలిసి ఉంటున్నాము. నా భర్త ఆదివారం రాత్రి మాతోపాటు అన్నం తిని పడుకున్నాడు. 12గంటల సమయంలో డోర్ తెరిచి ఉండడంతో బయటకెళ్లి చూశా. కట్టపైన నా భర్త పడుకొని ఉన్నట్లు గుర్తించి బెడ్‌షీట్ కప్పబోయాను. రక్తం కనిపించి అందరినీ పిలిపించాను.

-జయమ్మ, మొదటి భార్య, పెద్దహరివాణం

నా భర్త నన్ను అనుమానించేవాడు

నా భర్త శేకన్న నన్ను ఎప్పుడూ అనుమానించేవాడు. 20రోజుల క్రితం బెంగుళూరులో ఉండగా, నన్ను అనుమానించి వేధించాడు. నేను మా పుట్టినిల్లు కర్ణాటకలో పోలీసులకు ఫిర్యాదు చేశాను. నా భర్త మృతి చెందాడని తెలిసి సోమవారం వచ్చాను.

- గంగమ్మ, రెండో భార్య, పెద్ద హరివాణం



మృతదేహన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

నల్లమలలో కన్నడ శిలాశాసనం మాయం

● 17 ఏళ్లుగా పట్టించుకోని అధికార గణం

● అంతరించిపోతున్న పురాతన ఆలయాల చరిత్ర

ఓర్వకల్లు, ఆగస్టు 19 : ఓర్వకల్లు మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఓ శిలాశాసనం మాయమైంది. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లె మజరా గ్రామమైన గుమ్మితం తండా పరిసరాల్లోని రెండు కొండల మధ్య సుమారు 400 ఏళ్ల కిందటి ఆలయాలు ఉన్నాయి. వీటి కింద కోనేటి ఉంది. ఆలయం పైభాగాన 12, 13వ శతాబ్దానికి చెందిన కన్నడ, సంస్కృత భాషలు, తెలుగు అక్షరాలతో శిలాశాసనం ఉండేది. అయితే 2007లో శిలాశాసనంతో పాటు వీరభద్ర విగ్రహాన్ని గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకొని వెళ్లినట్లు సమాచారం. ఈ ఆలయాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉండగా.. ఆలయాలకు 23 ఎకరాల దేవుడి మాన్యం భూమి ఉంది. ఈ ఆలయాల పరిసర ప్రాంతాల్లో గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల వల్ల ఆలయాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్తులు నిరసనన కార్యక్రమాలు చేపట్టగా గ్రీన్‌కో అధికారులు రూ.2 కోట్లతో నూతనంగా ఆలయం నిర్మాణం చేపట్టి రహదారి కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ హామీని నెరవేర్చలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా శిలాశాసనం మాయమై 17 ఏళ్ల గడుస్తున్నా దేవదాయ, పురావస్తు శాఖల అధికారులు ఈ విషయం పట్టించుకోకపోవడం గమనార్హం.



కనుమరుగైన శిలాశాసనం (ఫైల్)

ఉరుకుంద క్షేత్రంలో అసౌకర్యాలు

● అడుగడుగునా భక్తుల నిలువు దోపిడీ

● దేవాలయ వద్ద కానరాని పరిశుభ్రత

● అవినీతిని అరికట్టడంలో అధికారులు విఫలం



కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం, ఆగస్టు 19: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. ఈ దేవాలయానికి ఒక్క శ్రావణమాసంలో దాదాపు 20 నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తుంటారు. మూడవ సోమవారం ఒక్క రోజే దాదాపు 3 లక్షల మంది భక్తులు వచ్చారు. ఆదివారం నుంచి ఏకధాటిగా భక్తులకు దర్శనం కల్పించారు. అయితే భక్తులు ఆలయం వద్ద అన్ని చోట్ల నిలువు దోపిడీకి గురవుతున్నా అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలో భక్తుల నుంచి క్షురకులు ఒక్కొక్కరికి వంద రూపాయలు వసూలు చేస్తున్నారు. తలనీలాలకు దేవాలయం వారు నిర్ణయించింది రూ.40. కానీ క్షురకులు మాత్రం వంద ఇవ్వనిదే గుండు కొట్టడం లేదు. ఆలయ అధికారులు దాదాపు రూ.4లక్షలకు నీటి సరఫరా కాంట్రాక్ట్ ఇచ్చినా భక్తులకు తాగునీరు అందడం లేదు. సుమారు 15 నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నా సోమవారం 8 ట్యాంకర్లు మాత్రమే కనిపించాయి. ఇవి ఏమాత్రం సరిపోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. నీటి కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి బిందె నీటికి రూ.40 చెల్లించి నీటిని కొనుగోలు చేశారు. దేవాలయ అధికారులు భక్తులు తాగునీరు సరఫరా చేయకపోవడంతో బిందె నీటిని రూ.40 ఇచ్చి కొన్నానని జంపాపురం గ్రామానికి చెందిన అంజినయ్య తెలిపారు.



నీరు లేక పిల్లలకు స్నానం చేయించేందుకు అవస్థలు పడుతున్న మహిళ

టెంకాయల వద్దా నిలువు దోపిడే

ఆలయ అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం టెంకాయ రూ.20కు విక్రయించాలి. కానీ అక్కడ వ్యాపారులు మాత్రం రూ.30 నుంచి రూ.35లకు అమ్ముతున్నారు. హోటళ్లలో ప్లేటు టిఫిన్ ఏదైనా సరే రూ.50. కనీసంగా నాణ్యత ఉండటం లేదు. దర్శన టికెట్ ధరల కౌంటర్ దగ్గర నుంచి ఆలయ ముఖద్వారాల వద్ద కూడా పారిశుధ్య లోపం కనిపిస్తోంది. పరిసరాలు దుర్వాసన అధికారులు చేతులు ఎత్తేశారు. ఎల్ఎల్‌సీ కాలువ వద్ద మురికి నీటిలోనే భక్తులు పుణ్యస్నానాలు చేశారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన తడికెల గదులు నాసిరకంగా ఉన్నాయి. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 19: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. సోమవారం జగన్నాథ గట్టుపై ఉన్న ఐఐఐటీడీఎం ప్రాంగణంలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. వివిధ రంగాల్లో సాంకేతికత, డేటా విశ్లేషణ, డేటా మైనింగ్, డేటా సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో పాటు కృషి ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తాను ఎంబీబీఎస్ చేసిన తర్వాత సివిల్స్ ఎంచుకున్న విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్యాంపస్‌లోని సదుపాయాలు, ల్యాబొరేటరీలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.గురుమూర్తి, డాక్టర్ సత్యబాబు, అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్, తాలుకా సీఐ శ్రీధర్, బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల భద్రత అందరి బాధ్యత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



జూనియర్ డాక్టర్లతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

కర్నూలు, ఆగస్టు 19: ఆడపిల్లలకు భద్రత అనేది కేవలం ఆలోచనే కాదని.. ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు ఏపీ జూనియర్స్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనకు ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు హాజరై సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుబ్రమ్మ, రాయలసీమ జేఏసీ అధ్యక్షుడు శ్రీరాములు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు అచ్యుత్, పవన్ కళ్యాణ్, అమూల్య, సింధూజ, శ్రావ్య, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు జీవాలు మృతి



పిడుగు పాటుకు మృతి చెందిన జీవాలు

అవుకు, ఆగస్టు 19 : అవుకు మండలం సంగపట్నం గ్రామ సమీపంలో పిడుగు పడి 47 జీవాలు మృతి చెందాయి. ఈ ఘటన సోమవారం జరిగింది. దాదాపు రూ. 4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు గుడిసె వెంకటేశ్వర్లు విలపించాడు. సంగపట్నం గ్రామానికి చెందిన గుడిసె వెంకటేశ్వర్లు ఉదయం జీవాలను మేపుకొనేందుకు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఆ సమయంలో జీవాలు చెట్టు కిందికి చేరుకున్నాయి. ఆ సమయంలో పిడుగు పడి జీవాలు మృతి చెందాయి. టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి, కొలిమిగుండ్ల, అంకిరెడ్డి పల్లె టీడీపీ నాయకులు హుశేన్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: మండలంలోని బెలుం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు కిశోర్‌కుమార్(15), బనగానపల్లె మండలం చెర్వుపల్లె గ్రామానికి చెందిన గద్దె ప్రభుదాస్(22) మృతి చెందారు. కాగా ప్రభుదాస్ బెలుం గ్రామంలో ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం తన సమీప బంధువుల అబ్బాయి కిశోర్‌కుమార్‌ను పనికి వెంట తెచ్చుకున్నారు. కిశోర్‌కుమార్ 9వ తరగతి చదువుతూ ఇటీవలే పాఠశాలకు వెళ్లడం మానేశాడు. ఈ క్రమంలో ఆదివారం గనుల్లో ఆపరేటర్ పని ముగించుకుని అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై బెలుం గుహల వద్ద రూముకు వెళ్తుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిని స్థానికులు 108 వాహనంలో బనగానపల్లెకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రభుదాస్ మృతి చెందగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కిశోర్‌కుమార్ మృతి చెందాడు. కాగా ప్రభుదాస్‌కు గత 8నెలల క్రితమే విజయలక్ష్మి అనే యువతితో వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచి వేయడం పలువురిని కలచివేసింది. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి డీఆర్వోగా చిరంజీవి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: జిల్లా ఇన్‌చార్జి డీఆర్వోగా చిరంజీవి నియమితులయ్యారు. ప్రస్తుత డీఆర్వో మధుసూదన్‌రావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు సెలవుపై వెళ్లడంతో చిరంజీవిని నియమించారు. ప్రస్తుతం ఈయన ఎన్‌హెచ్-44 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

కుందూలో పడి వ్యక్తి గల్లంతు

పాణ్యం, ఆగస్టు 19 : మండలంలోని తొగర్చేడు గ్రామ సమీపంలో కుందూలో పడి మిద్దూరు వెంకటేశ్వర్లు (52) ప్రమాదవశాత్తు పడి గల్లంతయినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం వెళ్లి కాలుజారి పడి గల్లంతయినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు గాలిస్తున్నారు.

ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి గల్లంతు

గడివేముల, ఆగస్టు 19: ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండలంలోని మంచాలకట్ట గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మిద్దూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి సోమవారం సాయంత్రం ఎస్సార్బీసీ కాలువలో కొట్టుకపోతుండగా గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. బంధువులు ఎస్ఆర్‌బీసీ వెంట గాలింపు చేపట్టారు. ఘటన వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళను వేధించిన నిందితులకు జైలు

కర్నూలు(లీగల్), ఆగస్టు 19: మహిళను వేధింపులకు గురి చేసిన ఘటనలో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ సరోజమ్మ సోమవారం తీర్పునిచ్చారు. నగరంలోని అరోరా నగర్‌కు చెందిన ఓ మహిళను నిందితుడు యాదవ వేణుగోపాల్, కురువ శేఖర్‌బాబులు వేధింపులకు గురి చేశారు. దీంతో ఆమె తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లగా.. నిందితులు 2017 జూన్ 13వ తేదీన ఫిర్యాది ఇంటికి వెళ్లి దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితురాలు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పును వెలువరించింది. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ విష్ణువర్ధన్ రెడ్డి వాదనలు వినిపించారు.

కౌలు రైతు ఆత్మహత్య

దొర్నిపాడు, ఆగస్టు 19: మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన అల్లూరి రమణ (34) అనే కౌలు రైతు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లూరి రమణ గత కొన్నేళ్లుగా పొలం కౌలుకు తీసుకొని సాగు చేసేవాడు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి సరిగా రాక చేసిన అప్పులు అధికమై ఒత్తిడి పెరగడంతో ఆదివారం రాత్రి మనస్తాపంతో ఇంటి బయట ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్య పిల్లలు రోదనలు పలువురిని కలిచి వేసింది. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరారు.



రమణ(ఫైల్)

రూ.లక్ష విలువ చేసే స్టార్టర్లు, కేబుళ్ల చోరీ

రుద్రవరం, ఆగస్టు 19: మండలంలోని నరసాపురం గ్రామంలో వ్యవసాయ మోటార్ల స్టార్టర్లు, కేబుళ్లు చోరీకి గురైనట్లు సోమవారం సాయంత్రం రైతులు కరణం వెంకోబరావు, సుబ్బయ్య, ఫక్కీరా ఇంకా పలువురు తెలిపారు. పది మోటార్ల వద్ద కేబుల్ వైర్లు, మరో నాలుగు మోటర్ల వద్ద స్టాటర్లు చోరీకి గురయ్యాయని బాధిత రైతులు వాపోయారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు.

మహిళ అదృశ్యం

కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 19 : మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన గురుర్యూన్సీ (26) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ వరప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 16న గురుర్యూన్సీ, ఆమె భర్త రాజా ఓబులేసు ఇరువురూ గొడవపడ్డారు. 16న సాయంత్రం నుంచి ఆ మహిళ కనిపించలేదు. ఈ దంపతులకు ఇద్దరు కూతుర్లు కార్తీక, లక్ష్మీకళ్యాణి ఉన్నారు. ఎర్రగుంట్లకు బయల్దేరి ఇక తిరిగి రాలేదని బాధితురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మమతా బెనర్జీ రాజీనామా చేయాలి

న్యాయవాదుల డిమాండ్

కర్నూలు(లీగల్), ఆగస్టు 19: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం ముందు న్యాయవాదులు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. జూనియర్ డాక్టరుపై జరిగిన ఈ అత్యాచారం మానవ జాతి సిగ్గుపడేలా ఉందన్నారు. ఈఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూపర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, మహిళా న్యాయవాదులు సుమనారాణి, వి.నాగలక్ష్మీదేవి, ఉమాదేవి, యుపీ లక్ష్మి, జ్యోతి, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, పి.దస్తగిరి పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారంపై బాధ్యత వహిస్తూ మమతా బెనర్జీ రాజీనామా చేయాలని ఐద్వా సీనియర్ నాయకురాలు నిర్మలమ్మ, జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నాయకులు భార్గవ్, అఖిల్ డిమాండ్ చేశారు. సోమవారం కేవీఆర్ కాలేజీ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేశం మొత్తం ఆందోళనలు జరుగుతుంటే మమతా బెనర్జీ వ్యవహారం


ఆర్‌యూలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిందితులకు సహకరిం చేలాగా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి సాయి, ఐద్వా నాయకురాలు మాలన్, వేణమ్మ, అమర్, ఆర్యన్, మనోహర్, యోగి పాల్గొన్నారు.

● కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఐసా ఆధ్వర్యంలో సోమవారం బిర్లాగేటు ఆవరణలో జూనియర్ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగస్వామి, నగర కార్యదర్శి పెద్దయ్య పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): మహిళా చట్టాలు పరిష్టంగా అమలు చేసి మహిళలకు భద్రత కల్పించాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ చేసి విశ్రాంతి తీసుకునే సమ యంలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేయడం సమాజానికి సిగ్గుచేటన్నారు. సమాజంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలన్నీ వృథా అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, అశోక్, రాజేష్, జోష్, అమర్, రాజు, రవి, ప్రవీణ్, వేణు. వివేక్ విద్యార్థులు పాల్గొన్నారు.

● **కోల్‌కత్తా ఘటనపై ఎంపీని కలిసిన జూడాలు:** కోల్ కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని జూనియర్ డాక్టర్లు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. సోమవారం ఎంపిని కలిసిన జూడాలు జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసును సీబీఐతో దర్యాప్తు చేయించి నిందితులకు త్వరగా శిక్షపడేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న సీపీఏ యాక్టును అమలు అయ్యేలా కృషి చేయాలని కోరారు.

కోడుమూరు: కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పద్మావతి కళాశాల విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. కళాశాల నుంచి కొత్తబస్టాండ్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామాంజనేయులు, ఇంద్ర, కిషోర్ పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ


ఎంపీని కలిసిన జూనియర్ డాక్టర్లు


కోడుమూరులో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ


దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: దివ్యాంగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ఆరు వీల్ చైర్లు పంపిణీ చేశామని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆరుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ బి.నవ్య అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందజేస్తామన్నారు. అందులో భాగంగా దివ్యాంగులకు ఆరు వీల్ చైర్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, విభిన్న ప్రతిభావం తుల శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: దోమల ద్వారా సంక్రమించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తిచెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నేషనల్ వెక్టార్ బర్న్ వ్యాధుల నియంత్రణ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్లు లీకేజీ ఉన్న ప్రదేశాల్లో ఫ్లష్ వాటర్‌లో మలేరియా, డెంగ్యూ వ్యాధులను విస్తరింపజేసే దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉన్నందున పైపు లీకేజీ సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పాటిస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కర్, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: కమిషనర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 19: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు నగర పాక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 అర్జీలు వచ్చాయి. కార్యక్ర మంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఆర్‌ఓ జునైద్, ఏసీపీ శశికళ, టిడ్కో అధికారి పెంచలయ్య, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దార్ వెంకటరమణ, ఎం పీడీవో శివనాగప్రసాద్ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈలు రామయ్య, రామసుబ్బారెడ్డి, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీఎం లక్ష్మీకాం తరెడ్డి, ఏపీవో కుమారసాయినాథ్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు


ఎస్ఐకి పూలబొకే ఇస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 19: ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సునీల్‌కుమార్‌ను సోమవారం కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, సోమయాజులపల్లె టీడీపీ నాయకులు ఆకుల మహేష్, కాకి దేవేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. అలాగే కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడును కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: సీపీఎం

కర్నూలు(రూరల్), ఆగస్టు 19: తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఆటో ప్రమాదంలో ఈ.తాండ్రపాడుకు చెందిన నలుగురు కూలీలు మృతి చెందారని, ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కర్నూలు రూరల్ మండలం సీపీఎం కార్యదర్శి పీటీ ఉశేనయ్య, గ్రామ సర్పంచు బాలాపీరా కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వారు కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూలీ పని చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలోని మానంపాడు గ్రామ పొలాలకు ఈ.తాండ్రపాడు వాసులు దాదాపు 14మంది ఆటోలో వెళ్లార న్నారు. మార్గమధ్యలో ఆగిఉన్న ఆటోను లారీ ఢీకొట్టడంతో అక్కడిక్కడే నలుగురు కూలీలు చనిపోయారన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఈ.తాండ్రపాడు ఎంపీటీసీ సభ్యులు మహ బూబ్‌బాషా, లక్ష్మీదేవి ఉన్నారు.

రేపు జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 19: జిల్లా ఉషూ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో సబ్ జూనియర్స్, సీనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 14 సంవత్సరాల వరకు సబ్ జూనియర్ బాలబాలికలకు, 18 నుంచి 31 సంవత్సరాల వరకు సీనియర్స్ పురుషులు, స్త్రీలు ఆధార్ కార్డుతోపాటు పాల్గొనాలని, వివరాలకు 9440047196ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏడో రోజూ ఆందోళన బాట

రిలే దీక్షకు సంఘీభావం తెలిపిన జనసేన

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 19: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటనపై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసన ఏడో రోజుకు చేరింది. ఎమర్జెన్సీ, నాన్ ఎమర్జెన్సీ విధులన్నీ బహిష్కరించి, నల్ల రిబ్బన్లు ధరించి ఆసుపత్రి ఆవరణలోని ఓల్డ్ సీఎల్‌జీ ఎదుట జూడాలు రిలే దీక్షల్లో కూర్చున్నారు. ఈ దీక్షలను జూనియర్ డాక్టర్ల సంఘం సీనియర్ నాయకులు డా.తనూజ్ ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని జనసేన నాయకులు పవన్, కరుణాకర్ సందర్శించి సంఘీభా వం తెలిపారు. ఈ దీక్షలకు జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డా.బ్రహ్మారెడ్డి, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బాలు నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

హంసా ఆధ్వర్యంలో.. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఏపీ హంసా కర్నూలు సిటీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన కార్యక్ర మం చేపట్టింది. అనంతరం జూడాల దీక్షా శిబిరానికి చేరుకుని సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, కర్నూలు సిటీ అధ్యక్షుడు టి.గోవిందస్వామి, సెక్రటరీ చక్రధర్, ట్రెజరర్ శివన్న, వైస్ ప్రెసిడెంటు సంపత్, అసోసి యేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంటకస్వామి, ఉమెన్‌వింగ్ సెక్రటరీ ప్రసూన, సంఘీభావం తెలిపారు. అనంతరం సిటీ అధ్యక్షుడు గోవిందస్వామి మాట్లాడుతూ వైద్యులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు రావాలని కోరారు.


దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కోడుమూరులో భారీ వర్షం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 19: మండలంలోని వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అల్లినగరం, అనుగొండ, రామాపురం, ముడుమలగుర్తి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో గత కొన్ని రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. వర్షం రాకతో పంటలకు బెట్ట తీరింది. సజ్జ, కంది, ఉల్లి, పత్తి వంటి పంటలకు మేలు చేకూరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 19: నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యుల సమావేశం సోమవారం సాయంత్రం ముగిసింది. నగర మేయర్ బీవై రామయ్య చాంబర్‌లో జరిగిన సమావేశానికి స్టాండింగ్ కమిటీ సభ్యులు జుబేర్ అహ్మద్, యూనుస్ బాషా, అన్నెపోగు క్రాంతి కుమార్, విక్రమసింహారెడ్డి, మిద్దె సిద్దమ్మ పాల్గొన్నారు. సమావేశంలో పారిశుధ్య కార్మికులకు సంబంధించి చర్చ జరిగింది. గత నెల 16న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 200 మంది కార్మికులను తీసుకోవాలని చేసిన తీర్మానాన్ని రద్దు చేస్తున్నట్లు, తిరిగి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం కోసం పెట్టనున్నట్లు మేయర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 19: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన గల నారాయణ బాలికల కాలేజీ ఎదురుగా ఈ నెల 15న ఆటో బోల్తా పడటంతో తీవ్ర గాయాలై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కల్లూరు మండలం ఇల్లూరు నగర్‌కు చెందిన పింజరి హుశేన్‌మియా (44) సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. కర్నూలు నుంచి ఆటోలో కూరగాయలు హెచ్-8 హోటల్‌కు తీసుకుని వచ్చి తిరుగు ప్రయాణంలో కర్నూలు వెళ్తుండగా.. నారాయణ కళాశాల వద్ద అకస్మికంగా కుక్క అడ్డం రావడంతో తప్పించబోయి ఆటో అదుపు తప్పి గుంతలో పడిపోవడంతో ఆయనకు రక్తగాయాలు కాగా తెలిపారు. వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుని భార్య పింజరి హుశేన్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: అవినీతి, అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడగుల టీఎం రమేష్ మాదిగ కలెక్టర్ రం జిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలంలోని మాదాపురం గ్రామంలో సర్వేనెం.759/ఏ, 700/1, 759/ఏ1 విస్తీర్ణంలో ఐదెకరాలు చొప్పున దాదాపు 12 మంది రైతులకు 60 ఎకరాల భూమి 2005 సంవత్సరంలో మాదిగ కులానికి చెందిన వారికి అసైన్డ్‌మెంట్ కమిటీ ద్వారా డీపట్టాలు మంజూరు చేసి పట్టాదారు పాసుబుక్‌లు పంపిణీ చేశారు. ఈ భూములను రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకులతో చేతులు కలిపి మాదిగలకు చెందిన డీపట్టా భూములను ఆన్‌లైన్‌నందు అడంగల్ 1బీ అక్రమార్కులకు ఎక్కించి ఉద్దేశపూర్వకంగా నేరపూరితమైన కుట్రకు పాల్పడి డీ పట్టాదారులకు మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య మాది గ, మాదాపురం గ్రామ బబాధితులు పాల్గొన్నారు.

కాలనీ ప్రజలకు న్యాయం చేయాలి

కర్నూలు(కలెక్టరేట్/న్యూసిటీ), ఆగస్టు 19: నగరంలోని 20వ వార్డు మారుతి మెగాసిటీ కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. సోమవారం సునయన ఆడిటోరియంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ సర్వే నెంబరు 154లో 50 కుటుంబాలు ఒక్క సెంటు రూ.30 వేల ప్రకారం పగిడాల నాగిరెడ్డి వద్ద 2012 సంవత్సరంలో కొన్నాయని అన్నారు. అయితే ఇప్పటి వరకు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా నాగిరెడ్డి కాలయాపన చేస్తున్నారన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో భూదందాలు, అక్రమాలకు పాల్పడి కాజేసి భూములను బాధితులకు తిరిగి ఇప్పించాలని కోరుతూ సీపీఐ అధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందించనట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. కల్లూరు మండల పరిధిలోని పెద్దపాడు గ్రామంలోని ఓడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రామక్రిష్ణ కోరారు. సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు

ఘనంగా వెంకటప్పస్వామి పండుగ

కోడుమూరు(రూరల్), ఆగస్టు 19: మండలంలోని వర్కూరులో వెంకటప్పస్వామి పండుగ ఘనంగా జరిగింది. స్వామి పల్లకి, నందికోలలతో తుంగభద్ర నదికి వెళ్లిన యువకులు సోమవారం రాత్రి గ్రామానికి చేరు కున్నారు. దీంతో ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం మేళ తాళాల మధ్య నందికోలలు ఆడిస్తూ స్వామి పల్లకిని హంద్రీనది ఒడ్డున ఉన్న ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా దారి పొడవునా బాణసంచా కాల్చారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: కల్లూరులోని ఆదిత్య పాఠశాలలో కల్లూరు ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ ఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై మాట్లాడుతూ జీవితంలో మధుర స్మృతులను మిగిల్చే ఫోటోలను ఫొటోగ్రాఫర్లు ప్రజలకు అందించగలుగుతున్నారని అన్నారు. అయితే వారిలో చాలా మంది చాలీ చాలనీ ఆదాయంతో ఇబ్బందులు పడుతున్నారని, దీనిని అధిగమించడానికి ఎప్పటికప్పుడు నూతన సాంకేతికను అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలని అన్నారు. మరోక అతిథి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది కొత్త కెమెరాల ద్వారా నాణ్యమైన ఛాయా చిత్రాలు తీసి ఆదాయాన్ని పెంచుకోవాలని అందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల జిల్లా అధ్యక్షుడు బండి కే వాసుదేవయ్య, సింగిల్ విండో మెంబర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ సైక్రియాటిస్టు డా.సిరిగిరెడ్డి జయారెడ్డి సంఘం అధ్యక్షుడు ఎస్కే భాషా, ఫొటోగ్రాఫర్లు మల్లికార్జున, విశ్వనాథ్, సుభాన్, సుధాకర్, మధు చాంద్‌బాషా, సురేష్ రాము, శేఖర్, బీసీ మధు, రంగనాథ్, బీజేపీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: విశ్వహిందూ పరిషత్ కర్నూలు జిల్లా మాతృశక్తి, దుర్గావాహిని విభాగం ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అభయాంజనేయ స్వామి ప్రఖండ నుంచి జిల్లా మాతృశక్తి సహసం యోజక పావని ఆధ్వర్యంలో ఎస్ఐ, రైటర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే త్రీటౌన్ పరిధిలో వరసిద్ధి వినాయక ప్రఖండ నుంచి జిల్లా దుర్గా వాహని కన్వీనర్ లక్ష్మి ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఈపూరి లక్ష్మి, సరస్వతి, సల్కాపురం నాగలక్ష్మి, బాబురావు, గిరిబాబు, ఈపూరి నాగరాజు, జిల్లా సహా కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): స్థానిక మాధవీ నగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ కాలం మారినా, దూరం పెరిగినా, చెరిగిపోని అందమైన అనుబంధం, అంతులేని అనురాగం అన్నా చెల్లెలు, అక్కాతమ్ముళ్ల బంధం అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి రక్షాబంధన్ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని రాజయోగిని, బ్రహ్మకుమారి మహాలక్ష్మి అక్కయ్య అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఓర్వకల్లులోని పలు కార్యాలయాల్లో అధికారులకు, సిబ్బందికి ఆమె రాఖీలు కట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సునీల్‌కుమార్, మండల రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఉక్కు పరిశ్రమలో అధికారులకు రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి మహాలక్ష్మి అక్కయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు.


ఓర్వకల్లు పోలీస్ స్టేషన్లో సిబ్బందికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి


కర్నూలులో..

జేసీని కలిసిన కమిషనర్

కర్నూలు(న్యూసిటీ),ఆగస్టు 19: నూతన జాయింట్ కలెక్టర్ బి.నవ్యను సోమవారం తన చాంబర్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నగర పాలక సంస్థ సంబంధించిన సమస్యలపై ఆమెతో చర్చించారు.


జేసీకి పూలబొకే ఇస్తున్న కమిషనర్

సమావేశాలను జయప్రదం చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 19: విశాఖపట్టణంలో సెప్టెంబరు 1, 2, 3, తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. సోమవారం కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో లలిత మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఏకైక జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీదే అన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 19: గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, నందికొట్కూరు మండలం కురువ సంఘం అధ్యక్షుడు అల్లూరు వెంకటేశ్వర్లు, ఓర్వకల్లు మండల కురువ సంఘం అధ్యక్షులు అల్లాబాబు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో బుడం ఆకు తిని 20 గొర్రెలు మరణించాయన్నారు. గ్రామంలో నష్టపో యిన గొర్రెల కాపరుల నుంచి వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కురువ మహేష్, రామయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదాం

గూడూరు ఆగస్టు 19: గూడూరు నగర పంచాయతీని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదామని చైర్మన్ జె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న అన్నారు. సోమవారం గూడూరులోని కర్నూలు రహదారిలోని మురుగు కాలువను ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రం చేసే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి


ఎంపీని కలిసిన రాయలసీమ సాగునీటి సాధన అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 19: కర్నూలులో కృష్ణా నది యాజమాన్యం బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగు నీటి సాధన అధ్యక్షుడు దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో ఎంపీ కార్యాలయంలో ఎంపీ. బస్తిపాటి నాగరాజు కలిసి ఓ వినతి పత్రం ద్వారా కోరారు. రాయలసీమలో సాగునీటిపై చర్చించారు. బోర్డు ఏర్పాటు చేయడం తోపాటు పంట కాలువలను వెడల్పు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: స్వామి వివేకానంద సంస్కృత ఉన్నత పాఠశాలలో సంస్కృత భాషా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ఎండీవీ జోగయ్యశర్మ హాజరై మాట్లాడుతూ అన్ని భాషలకు తల్లి వంటిది మన సంస్కృత బాషా అని అన్నారు. అనంతరం సంస్కృత భాషా పండితులను సత్కరించారు. కార్యక్రమంలో జి.వెంకట్రాముడు, ప్రధానోపాధ్యాయులు ఆర్.నీలవేణి, సంస్కృత ఉపాధ్యాయులు ఎం.ఎల్లయ్య, శైలజ, సుబ్బలక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జంతువులను నందనపల్లె షెల్టర్‌కు తరలించాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 19: నగర పాలక సంస్థ పరిధిలో రోడ్లపై తిరిగే జంతువులను నందనపల్లె షెల్టర్‌కు తరలించాలని మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విషయాన్ని సంబంధిత జంతువులను యజమానులకు సమాచారం అందించాలన్నారు.

నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు



కర్నూలు, ఆగస్టు 19: నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. 1998వ బ్యాచ్‌కు చెందిన ఈయన కడప జిల్లాలో ఎస్ఐ, సీఐగా పలు పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. ప్రస్తుతం కర్నూలు సీఐడీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై కర్నూలు నాలుగో పట్టణ సీఐగా వచ్చారు.

సీపీఐ నాయకుల నిరసన

ఆస్పరి, ఆగస్టు 19: మండలంలోని డీ కోటకొండ గ్రామ రహదారి గుంతలమయమైందని రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రోడ్డుపై పడిన గుంతల్లో పిచ్చి మొక్కలు నాటి నిరసన తెలిపారు. సీపీఐ రమేష్ మాట్లాడుతూ రోడ్డు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లన్న, రామాంజినేయులు, రాజు, హుస్సేనీ రసులమ్మ పాల్గొన్నారు.
ఫొటో19,పీకేబీఆర్01.సమావేశంలో మాట్లాడుతూన్న టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతనిధి రమాకాంత్ రెడ్డి

టీడీపీకి మెజార్టీ వచ్చిందని నీటి సరఫరా నిలిపివేత

పెద్దకడుబూరు, ఆగస్టు19: సార్వత్రిక ఎన్నికలలో మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని టీడీపీకి మెజార్టీ వచ్చిందన్న కక్షతో తాగునీరు సరఫరా నిలిపి వేయడం తగదు అని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దకడబూరులో ఆయన మాట్లాడుతూ టీడీపీకి మెజార్టీ ఇచ్చిన గ్రామాల్లో వైసీపీ సర్పంచులు కక్ష సాధిస్తున్నారన్నారు. అధికారులు వైసీపీ నాయకులు చెప్పినట్లు పని చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, ఈరన్న, కుర్మి పెద్దయ్య, రంగన్న, రాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఎన్నికల డీటీపై సస్పెన్షన్ వేటు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు19: ఎమ్మిగనూరు ఎన్నికల డీటీ రఘువీరాపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు సోమవారం సస్పెన్షన్ వేటు వేశారు. ఈయన ఎన్నికల ముందు నందవరంలో పని చేస్తున్న సమయంలో విధుల్లో నిర్లక్ష్యం, వివాదాల భూములను ఆన్‌లైన్‌లో తొలగించారనే ఆరోపణలు రావడంతో కలెక్టర్ రంజిత్ బాషా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం పై ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషఫణీని ఫోన్‌లో వివరణ కోరేందుకు సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

దేవనకొండ, ఆగస్టు 19 : మండలంలోని హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలని రైతుసంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు వీరశేకర్ మాట్లాడుతూ 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా పెండింగ్ పనుల వల్ల పది వేల ఎకరాలకు కూడా నీళ్లందడం లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు వస్తుందని, ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు వదలాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శ్రీరాములు ,సూరి ,ఆశోక్ ,యూసుప్‌బాషా, బజారి, మహబుబ్‌బాషా ,లక్ష్మిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

తుగ్గలి, ఆగస్టు 19: పంట నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కొండారెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాసులు, శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు కురవకపోవడంతో తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించిందని, ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ఎస్సీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 19: ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్సీహాస్టళ్లను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో ఎస్సీబాలికల, బాలుర ప్రీమెట్రిక్ హాస్టల్లు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి ఎమ్మిగనూరులో ఎస్సీ బాలికల, బాలుర హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 19: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కృష్ణ, నెట్టికంటయ్య, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కార్మికులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు జీవో ప్రకారం ప్రతి కార్మికునికి నెలకు రూ.16వేలు వేతనం ఇవ్వాలన్నారు. గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా పోషణ గడుస్తుందని ప్రశ్నించారు.

మాలలందరూ కలిసి పోరాడాలి

ఆస్పరి, ఆగస్టు 19: సుప్రీంకోర్టు తీర్పుకు మాలలందరూ కలిసి పోరాడాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది సోమవారం కోరారు. మండలంలోని కైరుప్పల గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు.


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


ఎమ్మిగనూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన

నిందితులను అరెస్టు చేయాలి

ఆదోని, ఆగస్టు 19: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, మహిళా నాయకురాలు లక్ష్మి, మున్సిపల్ ఛైర్మన్ శాంత డిమాండ్ చేశారు. వివిధ మహిళా సంఘాలు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించిందని, వారు సమగ్ర దర్యాప్తు చేసి వైద్య విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడి అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుపై ఉందని అన్నారు. విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలియజేశారు.

ఎమ్మిగనూరు: కోల్‌కత్తాలో వైద్యురాలి అత్యాచార ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. దేవసహాయం మాట్లాడుతూ ఆర్జీఆర్ ఆసుపత్రిలో ట్రైని వైద్యురాలిని ఆగస్టు 8న అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు సుధాకర్, కేవీపీఎస్ నాయకులు గుంటెప్ప, చిన్నప్ప, తిమ్మప్ప, సుమాల ఆంథోని, గుంటెప్ప, చిన్న, అరుణ్, రాముడు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆస్పరి: పశ్చిమబెంగాల్ కోలకత్తాలో వైద్య విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిన్ని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పరిలో జడ్పీ పాఠశాల విద్యార్థులతో అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు తరుణ్ తేజ్, మహేంద్ర, సంతోష్, అంజి పాల్గొన్నారు.

గోనెగండ్ల: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన దండగులకు వెంటనే శిక్షించాలని కేవీపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్ పై అత్యాచారం జరిపి హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరారు.

ఆదోని (అగ్రికల్చర్): వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, పద్మావతి వోకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం విరుపాక్షి డిమాండ్ చేశారు. సోమవారం అత్యాచారాన్ని నిరసిస్తూ విద్యార్థుల భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షాబ్బీర్ బాషా, పీడీఎస్‌వో విద్యార్థి సంఘ నాయకులు తిరుమలేష్, ప్రిన్సిపాల్ రామలింగారెడ్డి, అబ్దుల్ బాషా, అధ్యాపకులు డాక్టర్ సాలోమీ, డాక్టర్ అబ్దుల్ కలీక్, స్రవంతి, నిఖిల పాల్గొన్నారు.

● ఆదోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అధ్యాపకులు డాక్టర్ అయ్యప్ప, ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారి జోనాధన్ వీక్లీఫ్, ఉమాదేవి పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: కోల్‌కత్తా నగరంలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి, ఏరియా టీమ్ లీడర్ రెహానా డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పట్టణ పురవీదుల గుండా ర్యాలీ నిర్వహించారు.


పత్తికొండలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ఆదోనిలో ధర్నా చేస్తున్న వైద్యులు, నాయకులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఆదోని, ఆగస్టు 19: పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఇన్‌చార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్‌లు వేణు సూర్య, శ్రీనివాస రాజు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీవో నాగేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, బీటీలు పెద్దయ్య వలి భాష పాల్గొన్నారు.


అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలి

స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి అక్టోబరు 29వ తేదీ నాటికి డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలని ఇన్‌చార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్‌లోలు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 19వ తేదీన నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించి, అక్టోబర్ 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాతీయ రూపొందించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. 2025 జనవరి 6వ తేదీ నాటికి సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలన్నారు. ఎన్నికల కమీషన్ సూచించిన మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఉప తాహసీల్దార్ రుద్ర గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన పీఠాధిపతి

● మధ్వమార్గ్ కారిడార్, యాగశాల, పరిమళ పాఠశాల ఆధునికీకరణ

మంత్రాలయం, ఆగస్టు 19: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో రూ.1.40 కోట్లతో నిర్మించిన మధ్వమార్గ్ కారిడార్ (ఎంటీఆర్ లైన్), రూ.50 లక్షలతో పరిమళ విద్యానికేతన్ ఆధునీకరణ, రూ.1.40 కోట్లతో నిర్మించిన యాగశాల అభివృద్ధి పనులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శిలాఫలకాలను ఆవిష్కరించారు. సోమవారం వేర్వేరు సమయాల్లో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, పాఠశాల ఏవో రిటైర్డు డిప్యూటీ డీఈవో ఈరన్న, హెచ్ఎం చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఆయా శిలాఫలకాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల, మధ్వమార్గ్ కారిడార్, యాగశాలను అందుబాటులోకి రావడంతో మంత్రాలయానికి మరింత కళాత్మకంగా మారింది. ప్రారంభానికి వచ్చిన పీఠాధిపతికి విద్యార్థులు, దుకాణ యజమానులు, సంస్కృత పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుజీంద్ర కళాశాల ప్రిన్సిపాల్ రవి, మధుసూదనాచార్, పీడీ వెంకటేశ్, కాంట్రాక్టరు ఓబులయ్య, సైట్ ఇంజనీర్ ఉబ్బ రాఘవేంద్ర, ఇంజనీర్ నాగరాజు, శ్రీహరి, హనుమంతు, అప్రమేయాచార్, జనార్దన్ రెడ్డి, శశికాంత్ శెట్టి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి

శ్రీమఠానికి నగదు, బియ్యం, కూరగాయలు విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరు చెందిన నరేంద్ర అనే భక్తుడు లారీ కూరగాయలు, ఇరియూర్‌కు చెందిన హోటల్ నగేష్ అనే భక్తుడు రెండు లారీల కరగాయలు, బెంగుళూరు చెందిన నారాయణ స్వామి 250 క్వింటాళ్ల సోనమసూరి బియ్యం, గణదాలకు చెందిన లక్ష్మిపతి 26 క్వింటాళ్ల బియ్యం, కర్నూలు చెందిన కిషోర్ కుమార్ రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, స్టోర్ ఇన్‌చార్జిలు రవి కులకర్ణి, నారాయణరావు తెలిపారు. సోమవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని వారు దర్శించుకుని విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబసభ్యులకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, సుధీంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 19: ఎమ్మిగనూరు పట్టణంలోని దళితవాడల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎస్సీకాలనీ వాసులు సోమవారం తరలివచ్చి మున్సిపల్ కమిషనర్ గండిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దళితవాడ వాసులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కలుగొట్ల రోడ్డులోని ఎంబీ చర్చి నుంచి కబరస్తాన్ కొట్టాల వరకు రహదారి పూర్తిగా ధ్వంసమైందన్నారు. దళితవాడలో యువతకు ఉపయోగపడేలా లైబ్రరీ, వ్యయమశాల, పార్కు, ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీకాలనీకి శాశ్వత తాగునీటిని అందించేందుకు గాను 5లక్షల లీటర్ల సామర్థ్యంతో మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయలని, ఎస్సీ కమ్యునిటీ హాల్‌లో గత ప్రభుత్వం వార్డు సచివాలయానికి ఉపయోగించిందని, దాన్ని వేరే చోటకు మార్చి కమ్యునిటిహాల్‌ను ఎస్సీలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కదిరికోట ఆదెన్న, కదిరికోట వెస్లీ సునీల్, అడ్వకెట్ ఆనంద్, పేనుబడి ఇమ్మానియోల్, ఆనంద్, ఎస్ రాజు, ప్రసాద్, సంజీవ్, సుమాల ఆంథోని, ఉసేని, రంగన్న, హరి, ప్రసాద్, బంగారప్ప, ఆనంద్‌లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించవద్దు

ఆలూరు, ఆగస్టు 19: ఆలూరు పట్టణంలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించవద్దని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ నాయకులు షైన, ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్దన్, సీపీఎం నాయకులు షాకిర్ మాట్లాడుతూ బాలికల గురుకుల పాఠశాలను తుగ్గలి మండలానికి తరలించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలను మార్పు చేస్తే విద్యార్థినులను అక్కడికి పంపేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి సారించి ఆలూరు లోనే పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు..

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయండి

మంత్రాలయం, ఆగస్టు 19: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థిని కురువ పార్వతి ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, సహాయ కార్యదర్శి థామస్, ఉపాధ్యక్షులు వీరేష్ ఫిర్యాదు చేశారు. సోమవారం కర్నూలులో కలెక్టర్‌ను కలిసి బాలికది ఆత్మహత్య కాదని, హత్యే అని ఆరోపించారు. పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్లపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, రాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే వ్యవసాయ మార్కెట్ కమిటీ: ఎమ్మెల్యే

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 19: రైతుల సంక్షేమం కోసమే వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గత మూడు రోజులు కిందట వర్షానికి వేరుశనగ దిగుబడి తడిచి నష్టపోవడంతో మార్కెట్ యార్డ్‌ను సందర్శించి ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ రైతులు తమ పంట దిగుబడి అంతా తడిసిపోయి తీవ్రంగా నష్టపోవడం బాధాకరమన్నారు. కాలువలు పూడికతో నిండిపోవడం రహదారులు ఎత్తుగా ఉండి ప్లాట్‌ఫాంపైకి వర్షపు నీరంతా రావడం దిగుబడులు తడిచిపోయాయని అన్నారు. సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ డీఈ సుబ్బారెడ్డికి కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డికి సూచించారు. హమాలీలు, కూలీలు, కమిటీలో పనిచేస్తున్న గుమస్తాలు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రావాలంటే ఇబ్బంది అవుతుందని రైల్వే అండర్ పాస్ దారిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి శాంత కుమార్, నాయకులు నాగరాజుగౌడ్, శ్రీనివాసచారి, ఉపేంద్ర పాల్గొన్నారు.


డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను సీజ్ చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 19: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న జీనియస్ గ్లోబల్ స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఏ సంఘం తాలూకా నాయకులు ఏలియా, ఈరన్న, మహేష్‌రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్కూల్ దగ్గర నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అర్హత లేని వారితో పిల్లలకు విద్యబోధన చేయిస్తున్నారని అన్నారు. అలాగే ఫిట్‌నెస్ లేని బస్సులు, టాటాఏసీ, టాటా సుమోలలో విద్యార్థులకు తరలిస్తున్న రోడ్డుపై వెళ్తుతున్న వ్యక్తుల ప్రాణాలతో ఆవాహనాల డ్రైవర్‌లు చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. జీనియస్ గ్లోబల్‌స్కూల్ యాజమాన్యం పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


జీనియస్ గ్లోబల్ స్కూల్‌దగ్గర నిరసన తెలుపుతున్న నాయకులు

రెగ్యులర్ సిబ్బంది ఉన్నట్లా లేనట్లా?

కౌతాళం, ఆగస్టు 19: కౌతాళం గ్రామ పంచాయతీకి రెగ్యులర్ సిబ్బందిని నియమించి ప్రజలకు సేవలు అందించాలంటూ మండల టీడీపీ నాయకులు అమ్మువలి, నాగరాజు అన్నారు. సోమవారం ఎంపీడీవో సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కౌతాళం మేజర్ పంచాయతీలో గత మూడేళ్ల నుంచి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇంటి అద్దె బిల్లులు, కొళాయి బిల్లులు దాదాపు 30లక్షల వరకు బకాయిలు ఉన్నా ఎందుకు వసులు చేయడం లేదని విమర్శించారు. ఉన్న సిబ్బందిని పంచాయతీ సమాచారం అడిగితే సర్పంచ్ అజ్ఞ లేనిదే మేము ఏమి చేయలేమని చెబుతున్నారని తెలిపారు. రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని వారు కోరారు.

బ్రహ్మయ్యస్వామి సేవలు మరువలేనివి

తుగ్గలి, ఆగస్టు 19: బ్రహ్మయ్య స్వామి చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. ఆదివారం రాత్రి కోతికొండలో బ్రహ్మయ్య స్వామి (75)ని మృతి చెందారు. టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, ఈరన్న స్వామి, కృష్ణమూర్తి చౌదరి, బ్రహ్మానందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాతనలో ముందుగానే బ్రహ్మయ్య స్వామి సమాధి నిర్మించుకున్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మైరాముడు, డీలర్ అయ్యన్న, నారాయణ తదితరులు ఉన్నారు.


బ్రహ్మయ్య స్వామికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బసవేశ్వరుడికి జలాభిషేకం

మద్దికెర, ఆగస్టు 19 : మద్దికెర గ్రామానికి 3 కి.మీల దూరంలో ఉన్న బుగ్గ సంగమేశ్వరుని కోనేరు జలాలతో మద్దికెర గ్రామంలోని బసవేశ్వరునికి జలాభిషేకం చేశారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో మూడో సోమవారం బసవేశ్వర స్వామి ఆలయానికి చెందిన పూజారుల ఆధ్వర్యంలో బసవేశ్వరునికి జలాభిషేకం చేస్తారు.


బుగ్గ సంగమేశ్వర నుంచి జలాలు తీసుకువస్తున్న గ్రామస్తులు

యువత దైవమార్గం వైపు నడవాలి

మద్దికెర, ఆగస్టు 19 : యువత చెడు మార్గం వైపు నడవకుండా దైవ మార్గం వైపు నడవాలని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, టీడీపీ సీనియర్ నాయకులు ఎమాంబర్ రావు, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పారా రాఘవేంద్ర అన్నారు. సోమవారం భీమలింగప్ప తోటలో గల సుంకులమ్మ అమ్మవారికి వడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పారా సంజప్ప, సుంకన్న, నగేష్, పెద్దన్న, నాగరాజు, నాగమ్మ తదితరులు ఉన్నారు.

● స్థానిక మద్దమ్మ కుంట సమీపాన వెలసిన గ్రామ దేవత మద్దమ్మవ్వ, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం మూలవిరాట్ మద్దమ్మవ్వను సుబ్రహ్మణ్యం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓటర్ల జాబితా యథావిధిగా అమలు చేయాలి

ఆదోని టౌన్, ఆగస్టు 19: రానున్న మునిసిపల్ ఎన్నికలకు కూడా ఓటరు జాబితాను యధావిధిగా అమలు చేయాలని మాజీ టీడీపీ కౌన్సిలర్‌లు వైజీ బాలాజీ, శ్రీనివాస ఆచారి సోమవారం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికు వినతి పత్రం అందించారు. గత కౌన్సిల్ ఎన్నికలలో కొందరు ఓటర్ల పేరులను ఇతర వార్డులకు మార్పు చేయడంతో గందరగోళం పరిస్థితి నెలకొందన్నారు. తమ ఓటు ఏ వార్డులో ఉందో అర్థం కాక కొందరు పోలింగ్‌లో కూడా పాల్గొనకుండా తిరిగి వెళ్లిపోవడం జరిగిందన్నారు. ఈసారి అలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల జాబితాను యధావిధిగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సాగుదారుడికే పంట నమోదు

వెల్దుర్తి, ఆగస్టు, 19: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులకు పంట నమోదు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పంట నమోదు కౌలు రైతులకు కూడా వర్తిస్తుందన్నారు. కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, అగ్రికల్చర్ ఏవో అక్బర్ బాషా, డి.టి.ధనుంజయరెడ్డి, ఆర్ఐ మస్తాన్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

దేవనకొండ ,ఆగస్టు 19 : వయనాడ్‌లో వరద బాధితుల కోసం సీపీఎం అధ్వర్యంలో విరాళలాను సేకరించారు. రూ.11,957 విరాళాలు సేకరించిన్నట్లు సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్ తెలిపారు. రాష్ట్ర పార్టీ పీపుల్స్ రిలీఫ్ ఫండ్‌కు జమ చేసిన్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు యూసుఫ్, పెద్దయ్యనాయుడు, సుంకన్న, బజారి తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

పెద్దమ్మవ్వ సన్నిధిలో పౌర్ణమి వేడుకలు

పత్తికొండ టౌన్, ఆగస్టు 19: పత్తికొండలో సోమవారం పెద్దమ్మవ్వ దేవాలయ ప్రాంగణంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కుమ్మరివీధిలో ఉన్న పెద్దమ్మవ్వ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

21,22న న్యాక్ బృందం కళాశాల సందర్శన

ఎమ్మిగనూరు, ఆగస్టు 12: ఎమ్మిగనూరు పట్టణ శివారులో ఉన్న ఎస్ఎంఎల్ ప్రభుత్వ కళాశాలను 21, 22 తేదీలలో న్యాక్ బృందం సందర్శించినున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ న్యాక్ బృందం కళాశాలలో జరిగిన అభివృద్ధి పనులలో భాగంగా అత్యాధునీకమైన డిజిటల్ గదులను పరిపాలన భవనాన్ని వేలాది పుస్తకాలున్న సెంట్రల్ లైబ్రరీతో పాటు పలు విభాగాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అలాగే కళాశాల ఆధ్యాపక బృందంతో, పాటు పూర్వ విద్యార్థుల సంఘంతో కూడా కలువనున్నట్లు తెలిపారు. సమావేశంలో సూపరిటెండెంట్ మద్దిలేటి, ఆద్యాపకులు పాల్గొన్నారు.

